క్లుప్తంగా

ప్రకాష్ రెడ్డిని గెలిపించండి



ఎం.బండమీదపల్లిలో ఓటు అభ్యర్థిస్తున్న సర్పంచ్ ఉమాదేవి

రాప్తాడు: ఈ ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సర్పంచ్ ఉమాదేవి కోరారు. ఆదివారం మండలంలోని ఎం.బండమీదపల్లి గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు మాయమాటలు నమ్మవద్దన్నారు. ఎన్నికల సమయంలో నోటికొచ్చిన హామీలు ఇచ్చి తర్వాత వాటిని పట్టించుకోరని స్పష్టం చేశారు. చంద్రబాబు హామీలను కేవలం మేనిఫెస్టోలో మాత్రమే చూసుకోవాలని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పక్కీరప్ప, మారక సుబ్బారెడ్డి, నరసింహా రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రంగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో జోరుగా ప్రచారం



45వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న అనంత నవ్యత రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: నగరంలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశాలతో మేయర్ వసీంతో పాటు కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, ఎమ్మెల్యే కుటుంబీకులు గురువారం నియోజకవర్గంలో విస్తృత ప్రచారం చేశారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు అనంత మాలతి, అనంత సువర్ణ, అనంత నవ్యతరెడ్డి, అనంత మేఘన, అనంత లిఖిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నగరం మరింత అభివృద్ధి చెందడం ఖాయమన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన పలువురు టీడీపీ నాయకులు ఆ పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీడీపీ సీనియర్ నాయకులు పెద్ద పోతలయ్య, పెద్ద నాగేష్, చిన్న నాగేష్, అదెప్ప, నాగప్ప, మారుతి, శేషు, పంజు నాగార్జున తదితరులు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో గురువారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మాజీ సర్పంచ్ ఆదిశేషయ్య, సుధాకర్, నాగేంద్రరెడ్డి, శంకరయ్య, గొల్ల రాజశేఖర్, పురుషోత్తం, పంజు హరి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దగ్గుబాటి బరితెగింపు

- సర్వజనాస్పత్రిలో ఎన్నికల ప్రచారం
- ఫొటోలు తీస్తుండగా తిరస్కరించిన ఉద్యోగులు

అనంతపురం మెడికల్: టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థకు చెందిన ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించకూడదని ఎన్నికల నిబంధనలు స్పష్టంగా చెబుతున్నా.. దగ్గుపాటి, వారి అనుచర వర్గం ఏమాత్రం లెక్క చేయలేదు. గురువారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సూపరింటెండెంట్, రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్, నర్సింగ్ సూపరింటెండెంట్, ఆఫీస్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయాలని విన్నవిస్తుండగా ఆ సమయంలో దగ్గుపాటితో వచ్చిన పలువురు ఫొటోగ్రాఫర్లు ఫొటోలు తీయబోయారు. అక్కడే ఉన్న ఉద్యోగులు ఫొటోలు తీయాల్సిన పని లేదని చెప్పడంతో దగ్గుపాటి ఖంగుతిన్నాడు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులు వారికి మెరుగైన వైద్యం అందాలని వస్తుంటే దగ్గుపాటి ఓటు కోసం రావడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఇటీవల కాంగ్రెస్, సీపీఐ పొత్తుతో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న జాఫర్ కూడా ఆస్పత్రిలో ప్రచారం చేపట్టారు. ఊళ్లో వాళ్లకు నీతులు చెప్పే వామపక్ష పార్టీల నేతలు ఇలా ఎన్నికల నిబంధనలను అతిక్రమించడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది.

చలివేంద్రం ఏర్పాటు

రాప్తాడు: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి ఎస్‌వీబీటీ కళాశాల యజమాన్యం ముందుకొచ్చింది. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రాప్తాడులోని పోలీస్‌స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ మునిస్వామి ప్రారంభించారు. కరస్పాండెంట్ వీ.బీ.ఆర్.శర్మ, చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రా రెడ్డి, ఎండీ వెన్నపూస రమాకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, ఏఓ శివారెడ్డి, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ అమర్‌నాథ్ రెడ్డి, పీడీ రమేష్ పాల్గొన్నారు.

మారిన 'అనంత' ముఖచిత్రం

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అనంతపురం జిల్లా కేంద్రం ముఖచిత్రం మారిపోయింది. నగర చరిత్రలో లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక దృష్టిసారించడంతో నగరం నలుదిక్కులతో పాటు అన్ని డివిజన్లలో ఊహకందని అభివృద్ధి జరిగింది. రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రులు బలోపేతం అయ్యాయి. అనంతపురం నియోజకవర్గంలో రూ.1045 కోట్ల అభివృద్ధి జరిగితే ఒక్క అనంతపురం నగరంలోనే రూ.900 కోట్ల వరకు అభివృద్ధి జరిగిదంటే ఏ స్థాయిలో ప్రభుత్వం జిల్లా కేంద్రానికి ప్రాధాన్యత కల్పించిందో అర్థం చేసుకోవాలి.
– అనంతపురం కార్పొరేషన్:

- నియోజకవర్గంలో రూ.1,045 కోట్ల అభివృద్ధి
- మురికివాడల నుంచి ప్రధాన ప్రాంతాల్లో సమస్యల పరిష్కారం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీటీ, సీసీ రోడ్లు, కాలువల ఏర్పాటు
- ఆకట్టుకునేలా క్లాక్‌టవర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం



పై ఫొటోలో కనిపిస్తున్నది నగరంలోని 21వ డివిజన్‌లోని అంబేడ్కర్ నగర్. ఇక్కడ నివసించే వారంతా నిరుపేదలు. పారిశుద్ధ్య కార్మికులే అధికం. గత ప్రభుత్వంలో పట్టుమని 20 లక్షల అభివృద్ధి కూడా జరగలేదు. అటువంటిది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ డివిజన్లలో రూ.3 కోట్ల అభివృద్ధి జరిగింది. 10 రోడ్లు, 10 కాలువలతో పాటు కల్వర్టులు నిర్మించారు.

ఈ కింది ఫొటోలో మీరు చూస్తున్నది నగరంలోని ఎన్‌టీఆర్ మార్గ్ రోడ్డు. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి పాలకులు కేవలం ఈ రోడ్డుకు ఎన్‌టీఆర్ అని నామకరణం చేసి చేతులు దులుపుకున్నారు. నిత్యం భూ వివాదాలతో రోడ్డుకు మట్టి అడ్డం వేసే పరిస్థితులతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చెరువుకట్ట నుంచి గుత్తి రోడ్డుకు వెళ్లేవారి అవస్థలు వర్ణనాతీతం. అటువంటిది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.6 కోట్లతో ఎన్‌టీఆర్ మార్గ్ రోడ్డు వేశారు.



అనంతపురం కార్పొరేషన్: గుత్తి రోడ్డు కనకదాస విగ్రహం నుంచి తడకలేరు వరకు రూ.96 కోట్లతో ఇరువైపులా విశాలవంతమైన రోడ్డు, మేజర్, రెండు మైనర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేశారు. అలాగే విద్యుత్‌నగర్, జేఎన్‌టీయూ రోడ్డు, అనంతపురం శ్రీకంఠం సర్కిల్ నుంచి గుత్తి రోడ్డు వరకు, లక్ష్మీనగర్‌లోని నీలం సంజీవరెడ్డి నివాసం ఉండే ప్రాంతంలో బీటీ రోడ్లు, తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. ఇందుకోసం రూ.900 కోట్లకు పైగా ఖర్చు చేశారు. అందులో నగరపాలక సంస్థ నిధులు రూ.124.73 కోట్లు, సాధారణ నిధులు రూ.28.08 కోట్లు, నాడు–నేడు మొదటి దశ నిధులు రూ.4.96 కోట్లు, రెండో దశలో రూ.10.51 కోట్లు, సీఎం ప్రత్యేక నిధులు రూ.25 కోట్లతో 50 డివిజన్లకు ప్రాధాన్యత ఇచ్చి 19 ప్యాకేజీల్లో అభివృద్ధి పనులు చేయాలని నిర్ణయించారు. గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.14.58 కోట్లతో నగరంలో 151 రోడ్లు, 150 కాలువలు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.13.58 కోట్లతో అభివృద్ధి పనులు, ఎన్‌క్యాప్ నిధులు రూ.13 కోట్లతో రోడ్లు, గ్రీనరీ ఏర్పాటు చేశారు.

జిల్లాకే తలమానికం ఆర్‌ఓబీ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన క్లాక్‌టవర్ రైల్వే ఓవర్ బ్రిడ్జ్ జిల్లాకే తలమానికం అని చెప్పాలి. టీడీపీ స్వార్థ ప్రయోజనాలతో నేషనల్ హైవేలో ఉన్న రోడ్డు ఆర్అండ్‌బీ పరిధిలో వెళ్లగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో నేషనల్ హైవే పరిధిలోకి ఆర్‌ఓబీను తీసుకువచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో రూ.311.93 కోట్లలో అర్బన్ లింక్ ప్రాజెక్ట్ మంజూరైంది. నిర్దేశిత సమయం కంటే 5 నెలలు ముందుగానే బ్రిడ్జ్‌ను, రైల్వే అండర్ పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.

వైద్య సేవలు సూపర్..

జిల్లా కేంద్రంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ పరిస్థితిని ఎమ్మెల్యే అనంత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులతో ప్రభుత్వ వాటా రూ.30 కోట్లు విడుదలయ్యాయి. కాగా 2020లో కోవిడ్ సేవలతో ప్రారంభమైన ఆస్పత్రిలో, 2022 నుంచి స్పెషాలిటీ వైద్యం అందుబాటులోకి వచ్చింది. గడిచిన మూడేళ్లలో న్యూరోసర్జరీ, కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, ఎండ్రోగైనాలజీ, యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాల్లో 74,660 మందికి ఓపీ, 1312 మందికి సర్జరీలు చేశారు. రూ.లక్షలు విలువ చేసే వైద్యం ప్రజలకు ఉచితంగా అందుతోంది. నాడు–నేడు కింద రూ.300 కోట్లతో అనంతపురంలో ఎంసీహెచ్ బ్లాక్, సర్జికల్ బ్లాక్ , పీజీ, యూజీ హాస్టళ్లు ఏర్పాటు కానున్నాయి.



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి




క్లాక్‌టవర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి

సమస్యలు తీరాయి..



గతంలో వర్షం వచ్చిందంటే చాలు మా ప్రాంతంలో ఇళ్ల ముందే మురుగు నీరు. రెండు, మూడు రోజుల పాటు ఆ మురుగు దుర్వాసనతో నరకం చూసేవాళ్లం. ఇటువైపు ఎవరూ వచ్చే వారు కాదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అంబేడ్కర్‌నగర్ పూర్తిగా మారిపోయింది. ప్రతి వీధిలో రోడ్లు, కాలువలు ఏర్పాటు చేశారు. ఇంతకన్నా ఏం కావాలి సార్. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చాలా సార్లు మా ప్రాంతంలో పర్యటించి సమస్యలు తెలుసుకుని పరిష్కారం చూపారు.
– శీన, అంబేడ్కర్ నగర్

రెట్టింపు సంక్షేమం అందిస్తాం..



'గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు ఐదేళ్ల పాలనలో మాటలకే పరిమితం అయ్యారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రెండేళ్లు కోవిడ్‌తో గడిచిపోయినా.. కేవలం మూడేళ్లలో నగరంలో 30 ఏళ్లలో లేని విధంగా రూ.వందల కోట్లతో అభివృద్ధి చేసి చేతల్లో చూపించాం. నియోజకవర్గంలో రోడ్లు, కాలువల ఏర్పాటుకే రూ.800 కోట్లు కేటాయించాం. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేశాం. నాడు–నేడు కింద రూ.300 కోట్లతో సర్జికల్, ఎంసీహెచ్ బ్లాక్, హాస్టళ్లు ఏర్పాటు కానున్నాయి. మరోసారి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదిస్తే.. రెట్టింపు అభివృద్ధి చేసి చూపుతాం.
– ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం నగరపాలక సంస్థ వివరాలు

మొత్తం డివిజన్లు	50
సచివాలయాలు	74
నగర జనాభా	2,63,898
హౌస్ హోల్డ్స్	66,000

నియోజకవర్గంలో జరిగిన మొత్తం అభివృద్ధి: రూ.1,045 కోట్లు
టవర్‌క్లాక్ రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణ వ్యయం: రూ.311.93 కోట్లు
గుత్తి రోడ్డు పనులకు మంజూరు: రూ.96 కోట్లు
మైనర్ బ్రిడ్జ్‌ల నిర్మాణానికి ఖర్చు: రూ.21 కోట్లు
గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు: రూ.14.58 కోట్లు
నాడు–నేడు కింద ఎంసీహెచ్, సర్జికల్ బ్లాక్, హాస్టళ్ల ఏర్పాటుకు అయిన ఖర్చు: రూ.300 కోట్లు
పట్టణ ఆరోగ్య కేంద్రాల భవనాలకు కేటాయింపు: రూ.6 కోట్లు



మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆదరించండి



రాప్తాడురూరల్: ప్రజలకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



రాప్తాడురూరల్: రోడ్‌షోకు హాజరైన జనం

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: మంచి చేసిన ప్రభుత్వాన్ని మరోమారు ఆదరించాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి కోరారు. గురువారం సాయంత్రం అనంతపురం రూరల్ మండలం కట్టకిందపల్లిలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కట్టకిందపల్లి గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. గ్రామంలో అందరూ కలిసికట్టుగా ఉండాలన్నారు. గతం కంటే ఈసారి మెజార్టీ పెరుగుతుంది తప్ప తగ్గేదేలేదన్నారు. రూరల్ మండలంలో ప్రతి కార్యకర్త చాలా పట్టుదలతో పని చేస్తున్నారన్నారు. 13 నుంచి 20 వేల దాకా ఈ ఒక్క మండలం నుంచి మనకు మెజార్టీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీగా బోయ శాంతను, ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ శోభ, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, నాయకులు వరప్రసాద్ రెడ్డి, మాజీ సర్పంచులు యల్లప్ప, రామాంజనేయులు, సచివాలయ కన్వీనర్ నీరుగంటి నారాయణరెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ అడ్వకేట్ రామిరెడ్డి, అడ్వకేట్ హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తోపుదుర్తిలో ప్రచారం..

ఆత్మకూరు: నేను మీ ఊరి సొంత బిడ్డను మీ ఇంట్లో మనిషిగా ఉన్నా.. ఏ కష్టం వచ్చినా ప్రతి ఇంట్లో పెద్ద కొడుకులా ముందు నిలబడ్డా. మీ ఇంటి బిడ్డను మరోసారి ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కోరారు. గురువారం రాత్రి మండలంలో ఎమ్మెల్యే సొంత గ్రామం అయిన తోపుదుర్తిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాం. జగనన్న అందించిన సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందన్నారు. టీడీపీ జెండాలు మోసిన వాళ్లు కూడా సంతోషంగా ఉన్నారని తెలిపారు. జగనన్న అందించిన సంక్షేమ పథకాలను తీసుకున్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ పథకాలు అందించామని తెలిపారు. ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత రాప్తాడు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేశామని గుర్తు చేశారు.

సొంత డబ్బుతో అభివృద్ధి చేశాం..

నియోజకవర్గంలో అమ్మ డెయిరీ ద్వారా మహిళా పాడి రైతులకు ఉపాధి కల్పించినట్లు వెల్లడించారు. కరోనా సమయంలో రూ.కోట్లు ఖర్చు పెట్టి ఆక్సిజన్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయించామన్నారు. ఆస్తులు అమ్మి ప్రజాసేవ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. దోచుకోవడం.. దాచుకోవడమే టీడీపీ నైజమని ఆరోపించారు. ప్రజలు చంద్రబాబు మోసపూరిత హామీలను, పరిటాల కుటుంబాన్ని నమ్మే పరిస్థితుల్లో లేరని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబులేసు, ఎంపీటీసీ పోతులయ్య వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు తొలగించేందుకు బీజేపీ కుట్ర



బ్యాలెట్ నమూనా చూపుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: బీజేపీ ముస్లిం మైనార్టీల రిజర్వేషన్లు తొలగించేందుకు కుట్ర చేస్తోంది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ఉంటేనే ముస్లిం మైనార్టీల నాలుగు శాతం రిజర్వేషన్లు సాధ్యమని మేయర్ వసీం అన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని 38వ డివిజన్‌లోని కోవూర్ నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకర నారాయణను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఓ వైపు బీజేపీ కేంద్ర మంత్రులు రిజర్వేషన్ తొలగిస్తామంటూ ప్రచారం చేస్తుంటే టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నోరుమెదపడం లేదన్నారు. బీజేపీతో జత కట్టి ముస్లిం మైనార్టీలను మోసం చేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో నగరంలో రూ.1045 కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. పేదలు నివసించే ప్రాంతాల్లోనూ రూ.5 కోట్లకు పైగా ఖర్చు చేసి రోడ్లు, డ్రైనేజీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఇక్బాల్‌వి అవకాశవాద రాజకీయాలు

వైఎస్సార్‌సీపీలో అధికారాన్ని అనుభవించిన మహమ్మద్ ఇక్బాల్ అవకాశవాద రాజకీయాలు చేశారని మేయర్ వసీం విమర్శించారు. 2014 ఎన్నికలకు ముందు మహమ్మద్ ఇక్బాల్‌కు ఎమ్మెల్యే సీటు కేటాయించగా ఓడిపోయారన్నారు. ఆ తర్వాత కూడా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే.. చివరకు మైనార్టీలపై దేశ ద్రోహం కేసు పెట్టించిన టీడీపీలోకి చేరారన్నారు. కార్యక్రమంలో మైనార్టీ విభాగం జిల్లా కార్యదర్శి షేక్‌ఖాజా, నాయకులు చంద్ర, దాదు, మున్నా, నాగరాజు, మల్లి, కుమార్, అత్తర్‌ఖాజా, కిట్టు, గంగాధర్, నాగభూషణ, రహంతుల్లా, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాష్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం

రాప్తాడురూరల్: కక్కలపల్లికాలనీ పంచాయతీ పరిధిలోని నందమూరినగర్, ఎంఎస్ నగర్‌లో రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయ యాదవ్, మండల కన్వీనర్ రాధమ్మ, మాజీ ఉప సర్పంచ్ సుకుమార్, వార్డు సభ్యులు రామస్వామి, గౌస్‌మొహిద్దిన్, నాగేంద్రప్రసాద్, నాయకులు చిన్నపరెడ్డి, రమేష్, మైకేల్ ప్రసాద్, సుంకన్న, అంజి, రఫీ, లాలూ సాబ్, కార్పెంటర్ రాజు పాల్గొన్నారు.

చియ్యేడు గ్రామంలో..

చియ్యేడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటా తిరిగి ప్రచారం చేపట్టారు. సర్పంచ్ గంగాధర్ రెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ చెన్నయ్య, నాయకులు సుబ్బారెడ్డి, లక్ష్మయ్య, శివయ్య, రవీంద్రరెడ్డి, చలపతి, మాజీ సర్పంచ్ యల్లప్ప, మాజీ ఎంపీటీసీ సభ్యులు రామ్మోహన్ రెడ్డి, జయరామిరెడ్డి, వడ్డే రామకృష్ణ, ఓబిరెడ్డి, దేవర దుర్గమయ్య తదితరులు పాల్గొన్నారు. కక్కలపల్లికాలనీ పంచాయతీ సచివాలయం–3 పరిధిలోని గౌరవహోమ్స్, దండోరా కాలనీల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు కె.శ్రీనివాసులు, సర్పంచ్ తేజశ్విని, ఎంపీటీసీ సభ్యురాలు గాయత్రి దేవి, రామ్ లక్ష్మక్క, వార్డు మెంబరు భాను, ఎంఐఎం అలీ, ఎండీ హసేన్, లక్ష్మీదేవి, బి.నాగమణి, ప్రమీలమ్మ, అన్ను తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

అనంతపురం కల్చరల్: పౌరుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడం కేంద్ర, రాష్ట్రాల కర్తవ్యమని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ అన్నారు. గురువారం జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో పీపుల్స్ మేనిఫెస్టో విడుదల చేశారు. డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పాలనా వ్యవహారాల్లో సైతం విపరీతమైన మత జోక్యం పెంచుతోందని విమర్శించారు. దానికి కట్టడి చేసి ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంచాలని అందరూ సూచిస్తున్నా ఫలితం లేకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు రామిరెడ్డి, వీరరాజు, గాంగేనాయక్, లక్ష్మీనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం



వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరుతున్న తోపుదుర్తి శైలజా రెడ్డి

రాప్తాడు: ఎవరెన్ని కుట్రలు పన్నినా సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని వైఎస్సార్‌సీపీ సీనియర్ మహిళ నాయకురాలు తోపుదుర్తి శైలజా రెడ్డి అన్నారు. గురువారం ఉదయం రాప్తాడు, సాయంత్రం గాండ్లపర్తి గ్రామాల్లో ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మితో కలసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాటుపడుతున్నారని తెలిపారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా సంస్కరణలు తెచ్చి ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశామని, అర్హులైన ప్రతి పేదవాడికి నవరత్నాల ద్వారా పథకాలను అమలు చేశారన్నారు. జగనన్న ప్రభుత్వంలో పథకాలు నేరుగా ఇంటికే వస్తాయన్నారు. టీడీపీకి ఓటేస్తే జన్మభూమి కమిటీలదే పెత్తనం అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ రామాంజినేయులు, మండల కన్వీనర్ శేఖర్, మాజీ వైస్ ఎంపీపీ పరంధామ, వైఎస్సార్‌సీపీ నాయకులు రవికుమార్, జయన్న, అభి, నాగరాజు, రమచంద్ర, గంగాధర్ రెడ్డి, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి వైఎస్సార్‌సీపీ పెద్దపీట

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యారంగానికి వైఎస్సార్‌సీపీ పెద్దపీట వేసిందని పార్టీ విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు షేక్ బాబా సలామ్ స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 2019 నుంచి ఇప్పటిదాకా 'జగనన్న విద్యా కానుక', 'అమ్మ ఒడి', 'జగనన్న గోరుముద్ద', 'విద్యార్థుల అలవెన్సులు', 'జగనన్న విద్యా విదేశీ దీవెన', 'జగనన్న వసతి దీవెన', 'జగనన్న విద్యా దీవెన' పథకాలు తీసుకొచ్చి పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. నాడు–నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా మార్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు.